సాక్షి విశాఖపట్నం

శనివారం । 16 । మార్చి । 2024



ట్రయల్ కోర్టు అనుభవం అవసరం

ట్రయల్ కోర్టులో వాదించడం న్యాయవాదులకు ఓ కళ అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు అన్నారు. 8లో



మహారాణిపేట: కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నాలుగో తరగతికి చెందిన ఉద్యోగులు వివిధ సమస్యలపై నాలుగు వినతులు సమర్పించారు.



ఆ ముగ్గురికీ ఝలక్

8లో

న్యూస్‌రీల్

ఆర్కే బీచ్‌లో రామ్‌చరణ్



కలెక్టర్ పాత్రలో రామ్‌చరణ్

కొమ్మాది: మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ న్యూలుక్‌లో దర్శనమిచ్చారు. గేమ్‌చేంజర్‌లో రామ్‌చరణ్ కలెక్టర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఆర్కేబీచ్‌లో భారీ సెట్ నిర్మించి పలు కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. పొలిటికల్, యాక్షన్, థ్రిల్లర్ కథాంశాలతో తెరకెక్కిస్తున్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా గునిశెట్టి శ్రీనివాసరావు



శ్రీనివాసరావును అభినందిస్తున్న మంత్రి

విశాఖ సిటీ: రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విశాఖకు చెందిన గునిశెట్టి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎల్లంపల్లి శ్రీనివాస్ ఆయనను అభినందించారు. బీసీలతో పాటు అగ్రవర్ణాల్లోని వెనుకబడిన అన్ని వర్గాలకు ప్రభుత్వం రాజ్యాధికారం ద్వారా మేలు చేసిందని మంత్రి వెల్లంపల్లి అన్నారు.

18 నుంచి స్పెషల్‌యోగా థెరపీ తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి ప్రత్యేక యోగా థెరపీ తరగతులను నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయి. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ

ఉక్కునగరం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఉక్కునగరం త్రిష్టా మైదానంలో ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న ఈ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు కేంద్ర మాజీ మంత్రులు, సీపీఐ, సీపీఎం నాయకులు హాజరవుతున్నారు.

ఐఏఏపీ అధ్యక్షుడిగా ఆచార్య ఎంవీఆర్ రాజు



ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్ రాజు ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లైడ్ సైకాలజీ(ఐఏఏపీ) జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు సేవలు అందిస్తారు. ఇటీవల పాండిచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయనను జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఆయన ఈ సంస్థకు ఉపాధ్యక్షుడిగా కూడా సేవలు అందించారు. వరుసగా రెండోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై ఏయూ ఆచార్యులు రాజును అభినందించారు.

4న విశాఖ బార్ అసోసియేషన్ ఎన్నికలు

విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికలు ఏప్రిల్ నాలుగో తేదీన నిర్వహిస్తామని న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారి కేశ ప్రగడ నరసింహారెడ్డి ప్రకటించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ అనుమతి మేరకు విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఎన్నికలు ఈనెల 28న జరగవలసి ఉంది. అయితే బార్ కౌన్సిల్ అనుమతి ఆలస్యం కావడంతో వచ్చేనెల నాలుగో తేదీన ఎన్నికల నిర్వహణకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఎన్నికల అధికారి శుక్రవారం వివరాలను వెల్లడించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, ఉప కార్యదర్శి, కోశాధికారి, గ్రంథా లయ కార్యదర్శి, క్రీడా కార్యదర్శి, సీనియర్ న్యాయవాదులను ఇద్దరు మెంబర్లుగా నియమిస్తారు. వీరితో పాటు మరో 13 మంది కార్యవర్గ సభ్యులుగా ఉంటారు. ఈనెల 20 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 27న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం, ఏప్రిల్ 4న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలు ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు వరకు జరుగుతాయి. అదే రోజు రాత్రి ఫలితాలను ప్రకటిస్తారు.

'బండారు' చెంత
అసంతృప్తుల చింత..!

- టికెట్ రాకపోవడంతో ఇంకా మౌనముద్రలోనే సత్యనారాయణమూర్తి
- ఉమ్మడి విశాఖలో టికెట్ రాని తెలుగు తమ్ముళ్లంతా బండారు ఇంటికి..
- భవిష్యత్తు కార్యాచరణపై చర్చించిన నేతలు
- చంద్రబాబు వైఖరిపై గుర్రుగా ఉన్న సీనియర్లు
- పార్టీ టికెట్ ఇవ్వకపోవడంపై రగిలిపోతున్న కేడర్



విశాఖ సిటీ: జిల్లా తెలుగుదేశంలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. అధినేత చంద్రబాబుపై తెలుగు తమ్ముళ్లు కారాలు మిరియాలు నూరుతున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన వారిని పక్కన పెట్టి.. ఆర్థిక పరిపుష్టి ఉన్న వారికే టికెట్లు ఇవ్వడంపై సీనియర్లు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ రెండో జాబితా ప్రకటించిన తరువాత జిల్లా టీడీపీలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నిన్న మొన్నటి వరకు అధినేతపై ఈగ వాలనివ్వని నేతలంతా జాబితాలో చోటు దక్కకపోవడంతో.. చంద్రబాబుపై దుమ్మెత్తి పోస్తున్నారు. అసంతృప్తి నేతలంతా ఒక చోట చేరడం ఇపుడు టీడీపీలో హాట్ టాపిక్‌గా మారింది.

బండారుకు బుజ్జగింపులు

పెందుర్తి టికెట్‌ను తెలుగుదేశం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. ఈ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేష్‌బాబు ఎన్నికల బరిలో దిగనున్నారు. దీంతో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడిన తనను పక్కనపెట్టడంపై జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉంటే బండారుకు, జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు గత కొద్ది కాలంగా పొసగడం లేదు. పంచకర్లకు టికెట్ ఇస్తే తాను సహకరించనని గతంలోనే టీడీపీ అధినాయకత్వానికి తేల్చి చెప్పారు. పెందుర్తి టికెట్ కోసం బండారు చివరి నిమిషం వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయితే ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించినప్పటికీ బండారుకు ప్రత్యామ్నాయం చూపించకపోవడంపై రగిలిపోతున్నారు. గురువారం రెండో జాబితా ప్రకటించినప్పటి నుంచి బండారు పరవాడలో ఉన్న తన ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేదు. జిల్లా నాయకులు ఫోన్ చేసినప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో టీడీపీ జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు.. బండారు ఇంటికి వెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేసి వెళ్లిపోయారు.

బండారు నివాసానికి అసంతృప్తివాదులు

టికెట్ ఆశించి భంగపడిన టీడీపీ అసంతృప్తివాదులు బండారు నివాసంలో సమావేశమయ్యారు. అనకాపల్లి ఇంచార్జ్ పీలా గోవింద్, చోడవరం ఇంచార్జ్ తాతయ్యబాబు, మాడుగుల టీడీపీ నేత పీవీజీ కుమార్, ఇతర నాయకులు బండారు నివాసానికి వెళ్లి తమ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడిన తమను అధినాయకత్వం పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొంత మంది పార్టీ సీనియర్లతో పాటు చంద్రబాబు కూడా ఫోన్లు చేసి బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. జనసేన పార్టీ నేతలతో కలిసి పనిచేయాలని, పార్టీ నిర్ణయించిన, జనసేన నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది. దీనిపై అసంతృప్తి నేతలు మరింత రగిలిపోతున్నారు. పొత్తుల పేరుతో టికెట్లు ఇవ్వకపోగా.. పక్క పార్టీల విజయానికి కష్టపడాలని చెప్పడంపై మండిపడుతున్నారు. వీరిలో కొంత మంది పార్టీ మార్పుపై చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సీఎం జగన్‌తోనే విశాఖ అభివృద్ధి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, మేయర్ హరివెంకటకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు,వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

- రాష్ట్ర శ్రేయస్సుకు వైఎస్సార్‌సీపీని గెలిపించాలి
- రాష్ట్ర మంత్రులు బొత్స, అమర్‌నాథ్
- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం

ఎంవీపీకాలనీ: రాష్ట్ర శ్రేయస్సు కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని రాష్ట్ర మంత్రి బొత్స సత్యానారాయణ అన్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయాన్ని లాసన్స్ బే కాలనీలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ పేదలకు మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు అందాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సంక్షేమాన్ని, ప్రజాకర్షక పాలనను అడ్డుకోవాలని ప్రతిపక్ష పార్టీలు కుట్రపన్నుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా పెత్తందారులకు, సామాన్యులకు మధ్య యుద్ధంగా ఈ ఎన్నికలు నిలుస్తున్నాయన్నారు. మంత్రి అమర్‌నాథ్, మాజీ మంత్రి కృష్ణదాస్ మాట్లాడుతూ విశాఖ అభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్‌కు ప్రత్యేక విజన్ ఉందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపాలెం పోర్టు, ఇనార్బిట్‌మాల్, అదాని డేటా సెంటర్, పలు ఫిషింగ్ హార్బర్లు, పోర్ట్ ఆధునికీకరణ ఇలా ఎన్నో ప్రాజెక్టులు రానున్న రోజుల్లో విశాఖ రూపురేఖలు మార్చనున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తే విశాఖ ఖ్యాతి అంతర్జాతీయంగా వెలుగొందుతుందన్నారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ , వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కృపా జ్యోతి, ఎస్సీ విభాగం అధ్యక్షుడు శివరామకృష్ణ, కల్చరల్ విభాగం ప్రతినిధులు వంకాయల మారుతిప్రసాద్, పోతిన శ్రీనివాసరావు, వంగపండు ఉష తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్షకు ప్రత్యేక ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాలు
- హాజరుకానున్న 19,664 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లపై సమీక్షించిన జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ అశోక్

విశాఖ విద్య: జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్ –1 స్క్రీనింగ్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. పరీక్ష నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాలులో చీఫ్ సూరింటిండెంట్లు, లైజనింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని, 19,664 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, సంబంధిత ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. పేపర్-1 పరీక్ష ఉదయం 10గంటల నుంచి 12 వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2గంటల నుంచి 4 వరకు రెండు దఫాలుగా జరుగుతుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు, అభ్యర్థుల సౌకర్యం దృష్ట్యా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 0891 – 2590100, 0891 – 2590102 నంబర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 7 గంటలకు కలెక్టరేట్ స్ట్రాంగ్ రూంకు వచ్చి రెండు పూటలకు సంబంధించిన పరీక్షా పత్రాలను తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో
24 మందికి చోటు

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీలో విశాఖ జిల్లా నేతలకు పెద్ద పీట వేశారు. ఏకంగా 24 మంది నాయకులకు చోటు కల్పించారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, తైనాల విజయ్‌కుమార్, ఎస్.ఎ.రెహ్మాన్, ఉరుకూటి అప్పారావు, గుడిమెట్ల రవికుమార్, రొంగలి జగన్నాథంలను నియమించారు. అలాగే రాష్ట్ర కార్యదర్శులుగా యతిరాజుల నాగేశ్వరరావు, పి.వెంకట నారాయణ, గొలగాని శ్రీనివాస్, పిన్నమరాజు సతీష్‌వర్మ, పి.వి.రమణమూర్తి, మంత్రి రాజశేఖర్, వి.వి.ఎస్.ఎం.రాజా, నడింపల్లి కృష్ణరాజు నియమితులయ్యారు. రాష్ట్ర అదనపు కార్యదర్శులుగా డి.వి. అప్పారావు, వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా పోతిన హనుమంతరావు, ఎం.శ్రీనివాస్‌నాయుడు, దేవరకొండ మార్కండేయులు, తాడి జగన్నాథరెడ్డి, గుడివాడ అప్పల వెంకట లతీష్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా డాక్టర్ చెబురు వెంకటరావు, లింగం శ్రీనివాస్‌లు నియమితులయ్యారు.

రాష్ట్ర ఐటీ విభాగ సంయుక్త కార్యదర్శిగా నూకారెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఐటీ విభాగ సంయుక్త కార్యదర్శిగా విశాఖ జిల్లాకు చెందిన కొల్లి నూకారెడ్డి నియమితులయ్యారు.

రాష్ట్ర ఎస్సీ సెల్ జోనల్ ఇంచార్జ్‌గా అల్లంపల్లి రాజుబాబు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీలో విశాఖ జిల్లాకు చెందిన 8 మంది నాయకులకు చోటు కల్పించారు. కమిటీ జోనల్ ఇంచార్జ్‌గా అల్లంపల్లి రాజుబాబు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా జి.విక్టర్, ఎం.పరదేశి, కార్యదర్శులుగా యరగపర్తి స్వర్ణమణి, బాగం గోపాల్‌రావు, బోణి షణ్ముఖరావు(దేవ), సంయుక్త కార్యదర్శులుగా సరిపల్లి రామారావు, పుండి మల్లేశ్వరరావులను నియమించారు.

ఓటర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం



ఫోన్ కాల్స్‌ను స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఓటర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించే నిమిత్తం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్–ఓటర్స్ హెల్ప్‌లైన్ కార్యక్రమం మూడో రోజు కూడా విజయవంతంగా సాగింది. శుక్రవారం వీసీ హాలు నుంచి నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున పాల్గొని ప్రజల నుంచి ఫోన్ ఇన్ ద్వారా వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 17 మంది ఫోన్ చేసి వారి సమస్యలను విన్నవించుకున్నారు. శనివారం సాయంత్రంలోగా ఫిర్యాదులను పరిష్కరించి, నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు రోజులుగా వచ్చిన వినతులపై కలెక్టర్ సమీక్షించారు. ఓటరు చిరునామా మార్పు, కొత్త కార్డు పొందడానికి, ఇంటిపేరు సరిచేయడం, వయసు తప్పుగా నమోద కావడం, తదితర అంశాలపై పలువురు ఓటర్లు కలెక్టర్‌కు నివేదించారు. ఓటు బదిలీ, చిరునామా మార్పులు, ఎపిక్ కార్డుల జారీ విషయంలో తక్షణ చర్యలు చేపడతామని, మరింత సమాచారం, సహకారం అందించేందుకు బీఎల్వోలను ఇంటింటికీ పంపిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, కలెక్టరేట్ ఏవో బీఎస్ దేవ్ ప్రసాద్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సన్నద్ధతకు చేపడుతున్న చర్యలు, రూట్ మొబైల్స్ సంఖ్య, ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ అవసరం, పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లు ఇతరత్రా చర్యలపై చర్చించారు. అలాగే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా జరిగే విధంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. నగర ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ–1 మణికంఠ, డీసీపీ–2 సత్తిబాబు, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, ఏడీసీపీలు, ఏసీపీలు పేర్కొన్నారు.

ఎన్నికల విధులకు సిద్ధంకండి

కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచే ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్‌తోపాటు మిగిలిన బృందాల్లోని ఉద్యోగులందరూ ఎన్నికల విధులకు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్వోలు, ఏఈఆర్వోలతో కలసి ఆయన వివిధ అంశాలపై వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేయాలని, ఓటరు జాబితాలో మార్పులు చేసే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని నోడల్ అధికారులకు సూచించారు. జిల్లాలో 1,941 కేంద్రాల్లో పోలింగ్ జరగనుందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పనిసరిగా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వస్తుందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కలెక్టరేట్లో 24 గంటలు పని చేసేలా కాల్ సెంటర్, వెబ్ కాస్టింగ్, అభ్యర్థి ఖర్చు వివరాలు నమోదు, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రచారం జరుగుతున్న ప్రతి అభ్యర్థి అడ్వర్టైజ్మెంట్, పెయిడ్ ఆర్టికల్స్ వార్తలను గమనించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలను పూర్తిచేస్తామని తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట: జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ తెలిపారు. పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తాగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాద కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయన్నారు. విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు.

నగరంలో స్వైన్ ఫ్లూ కేసులు?

మహారాణిపేట : నగరంలో స్వైన్ ఫ్లూ బాధితులు పెరుగుతున్నారు. వాతవరణంలో వస్తున్న మార్పులతో జ్వరం,జలుబు,కళ్లమంటలు,తొలనొప్పితో ప్రజలు బాధపడుతున్నారు. అంతేకాకుండా శ్వాసకోశ సమస్యలతో అనేక మంది బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఆరిలోవ, అక్కయ్యపాలెం ఏరియాల్లో ఉన్న ఆస్పత్రుల్లో స్వైన్ ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్నట్టు తెలిసింది. నగరంలో స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కడా నమోదుకాలేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వివిధ ఆస్పత్రులలో చికిత్సపొందుతున్న స్వైన్ ఫ్లూ అనుమానితులకు పరీక్షలు చేస్తామని, రిపోర్టులు వస్తేగానీ స్వైన్‌ఫ్లూగా నిర్ధారించలేమని ఆయన స్పష్టం చేశారు.

గ్రీన్ పోర్టుగా అభివృద్ధి చేస్తున్నాం

విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు



కలెక్టర్ మల్లికార్జునతో కలిసి సీహార్స్‌ను ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

జగదాంబ: విశాఖను పోర్టును గ్రీన్‌పోర్టుగా అభివృద్ధి చేస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ అంగముత్తు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో కలసి రూ.2.23 కోట్లతో అభివృద్ధి చేసిన సీహార్స్ ప్రతిమలు, వాటి చుట్టూ వాటర్ ఫౌంటెన్, పోర్టు ముఖద్వారం నుంచి పోర్టు భవనం వరకు చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ పోర్టు–జీవీఎంసీతో అనుసంధానం అయ్యే అన్ని ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు స్థానిక సంస్కృతి సంప్రదాయలు తెలిపే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. భీమిలి నుంచి విశాఖ పోర్టు వరకు మడ అడవులు పెంచేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. విశాఖ నగర సుందరీకరణ కోసం అవసరమైన నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఒకేషనల్ కోర్సులు చదివే వారికి శనివారంతో పరీక్షలు పూర్తి కానున్నాయి. వీరు వెయ్యిమంది లోపు ఉంటారని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొదటి, రెండో సంవత్సరం కలిపి 82,766 మంది విద్యార్థులు రాశారు. పరీక్షలు విజయవంతంగా పూర్తికావటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఏడాదిపాటు ఎంతో శ్రద్ధతో సిద్ధమై పరీక్షలకు రాసిన విద్యార్థులు సైతం వీటిని విజయవంతంగా పూర్తి చేసుకొని ఒత్తిడి నుంచి బయటపడ్డారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు సందడిగా కనిపించారు. రెసిడెన్షియల్ కాలేజీల్లో ఉంటూ చదువుకున్న విద్యార్థులు పరీక్షలు పూర్తికావటంతో ఇంటిదారి పట్టారు.

19 నుంచి ఐపీఎల్ టికెట్ల విక్రయాలు!

విశాఖ స్పోర్ట్స్: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) అంటేనే గేమ్ విత్ ఎంటర్‌టైన్‌మెంట్. 16 సీజన్లు విజయవంతంగా పూర్తి కాగా.. 17వ సీజన్ ఈ నెల 22న ప్రారంభం కానుంది. ప్రస్తుత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) జట్టు హోమ్ మ్యాచ్‌ల్లో తొలి రెండింటిని విశాఖ వేదికగా ఆడనుంది. ఇందుకోసం ఇప్పటికే వైఎస్సార్ స్టేడియంలో ఆటగాళ్లు తీవ్ర కసరత్తులు చేస్తున్నారు. శనివారంతో ప్రాక్టీస్ ముగించి.. 17, 19వ తేదీల్లో స్టేడియంలోనే ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడనుంది. అనంతరం సీజన్ ప్రారంభ వేడుకలకు తరలివెళ్లనుంది.

డీసీ జట్టు మెంటర్ సౌరభ్ గంగూలీతో పాటు జట్టు కోచ్ రికీ పాంటింగ్ సలహాలు, సూచనలతో ప్రాక్టీస్ సెషన్స్‌లో ఆటగాళ్లు చెమటోడ్చుతున్నారు. కాగా.. 2020లో డీసీ టైటిల్ పోరులో తలపడటం మినహా ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేదు. ఈసారి విశాఖలోనే శుభారంభం చేయాలని ఆ జట్టు ఉవ్విళ్లూరుతోంది. ఈ నెల 31న సీఎస్‌కేతో, ఏప్రిల్ 3న కేకేఆర్‌తో డీసీ ఆడనుంది. సీఎస్‌కే జట్టు 30న సాయంత్రం ఆరుగంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రాక్టీస్ చేయనుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు ఒకటో తేదీనే విశాఖ రానుంది. అదే రోజు సాయంత్రం, తర్వాత రోజు ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రాక్టీస్ చేయనుంది.

ఈ మ్యాచ్‌లకు సంబంధించి టికెట్ల విక్రయాలను ఈ నెల 19 నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించేందుకు డీసీ మేనేజ్‌మెంట్ సన్నాహాలు చేస్తోంది. మ్యాచ్ వీక్షించే వారి కోసం బఫే డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ టిక్కెట్ ధర ఏకంగా ఒకరికి రూ.18వేలు ఉండనుంది. ఇక బెంటో బాక్స్ టికెట్ ధర రూ.15 వేలు, రూ.12 వేలు, స్నాక్స్ బాక్స్ ధర రూ.10 వేలు, రూ.7,500గా నిర్ణయించారు. జనరల్ టికెట్లు రూ.7,500, రూ.5 వేలు, రూ.3,500, రూ.3 వేలు, రూ.2,500, రూ.2 వేలు, రూ.1,500తో పాటు కనిష్ట ధర రూ.1000గా ఆయా బాక్స్‌లను అనుసరించి స్టేడియం కెపాసిటీ 27 వేల టికెట్లను విక్రయించనున్నారు. డీసీ మెంటర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ, మాజీ క్రికెటర్ వై.వేణుగోపాలరావును ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించి.. క్రికెట్‌కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

సంత్రగచ్చి-మహబూబ్‌నగర్ మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: సంత్రగచ్చి-మహబూబ్‌నగర్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. సంత్రగచ్చి-మహబూబ్‌నగర్(08845) స్పెషల్ 18, 25వ తేదీల్లో సంత్రగచ్చిలో మధ్యాహ్నం 12.50 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు తెల్లవారు 1.40 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 2 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్ వెళ్తుంది. మహబూబ్‌నగర్-సంత్రగచ్చి (08846) స్పెషల్ 19, 26వ తేదీల్లో మహబూనగర్‌లో రాత్రి 8.20 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 11 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 11.20 గంటలకు బయలుదేరుతుంది.

IN THE HONOURABLE COURT OF PRINICIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
SOP No: 1 OF 2024

Between:
Sri P.S. Srinivasan, S/o. late S.Seshadri, Hindu, aged 58 years, residing at railway quarters number 804/b, BN1TN colony, Thatichetlapalam Vishakhapatnam .....Petitioner
And :
1. **The Senior Divisional Personnel officer,** East Coast Railways, Visakhapatnam
2. **The Divisional Railway Manager,** East Coast Railways, Waltair. .....Respondent

GENERAL NOTICE

Notice is hereby given to the General Public that Sri P.S.Srinivasan, S/o. late S.Seshadri is the petitioner filed above SOP 1 of 2024 for grant of succession certificate of DCRG amount and other settlement amounts of Rs 12,00,000/- not received by legal heir of deceased S.Sriram from The Divisional Personnel officer, East Coast Railways, Visakhapatnam and S.Sriram, S/o. late S.Seshadri was expired on 30th June 2018 due to the cancer and his wife N. Mydhili was demised on 26th June 2019 both are having no children in their lifetime and the petitioner is only legal heirs of deceased S.Sriram, S/o. late S.Seshadri.

The above - named petitioner filed a petition, any person interest stating the nature of his/her interest and ground of objection on **18-3-2024 at 10.30 a.m.** in the forenoon in person or by pleader duly instructed and able to answer all materials questions relating to the above proceedings that in default of your appearance on the aforesaid day, the issues will be settled and the petition heard and determined in your absence.

SAKA TARUN & BVS GANESH
Advocates, Visakhapatnam
Cell No: 7032788391

- ఫిరాయింపుదారుల్ని కరివేపాకులా చూసిన చంద్రబాబు
- నాడు డబ్బుకు ఆశపడి విలువలున్న పార్టీని వీడిన ఎమ్మెల్యేలు
- పాడేరు సీటు ఆశించిన గిడ్డి ఈశ్వరికి మొండిచెయ్యి
- రంపచోడవరం టికెట్ కోసం భంగపడ్డ వంతల రాజేశ్వరి
- కిడారి శ్రవణ్‌ని వంచించిన చంద్రబాబు
- రాజకీయ భవిష్యత్తు నాశనం చేశారంటూ వాపోతున్న ఫిరాయింపుదారులు

ఆ ముగ్గురికీ ఝలక్

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని తెలిసి కూడా.. నాయకులుగా మలిచి.. చట్టసభలకు పంపించిన పార్టీని వెన్నుపోటు పొడిచి మరీ.. ఆయన పంచన చేరారు. తీరా.. వారి అవసరం లేదని అనుకున్న చంద్రబాబు.. కూరలో కరివేపాకులా పక్కన పెట్టేశారు. విజ్ఞత కలిగిన పార్టీకి దూరమై.. విలువల్లేని పార్టీలో చేరి.. ఇప్పుడు వంచనకు గురయ్యామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు నేతలు వైఎస్సార్‌సీపీని వంచించి.. టీడీపీలో చేరి.. పాపాలు మూటకట్టుకున్నామంటూ అనుచరగణం ఎదుట బోరుమంటున్నారు.


గిడ్డి ఈశ్వరి


కిడారి శ్రవణ్


వంతల రాజేశ్వరి

సాక్షి, విశాఖపట్నం : ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తూ.. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని.. ఆదరించిన పార్టీ విశ్వాసాన్ని అమ్ముకున్న ప్రజాప్రతినిధులు.. ఇప్పుడు బేల చూపులు చూస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంతలో పశువుల్లా ఎమ్మెల్యేల్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కొనేశారు. ఒడ్డు దాటే వరకే ఓడ మల్లన్న.. ఆ తర్వాత బోడి మల్లన్న అనే సూత్రాన్ని ప్రతిసారీ తూచ తప్పకుండా పాటించే నాయకుడు చంద్రబాబే అన్న విషయం జగమెరిగిన సత్యం. అది తెలిసి కూడా.. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు తల్లిలా ఆదరించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వదిలేసి.. టీడీపీ కండువా కప్పేసుకున్నారు. ఇప్పుడా టీడీపీ.. టికెట్ ఇవ్వకుండా బలిపశువుల్ని చేయడంతో రోడ్డున పడ్డారు. ఫిరాయింపుదారుల రాజకీయ పరిస్థితి గాల్లో దీపాల్లా మారిపోయాయి.

'కిడారి' సీటుకు కిరికిరి..!

రూ.కోట్లు.. మైనింగ్ లైసెన్సుల ఆశ చూపి.. మరో గిరిజన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుని సైతం ఫిరాయింపు ఎమ్మెల్యేగా ముద్రవేసేశారు చంద్రబాబు. 2014లో వైఎస్ జగన్ నమ్మి అరకు టికెట్‌ని ఇస్తే.. వైఎస్సార్‌సీపీ దయతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే.. బాక్సైట్ మైనింగ్ లైసెన్సుల కోసం ఆశపడుతున్నట్లు గ్రహించిన టీడీపీ.. కిడారికి.. అదే ఎర వేసేసింది. రూ.12 కోట్లు.. మైనింగ్ లైసెన్స్ ఇస్తామని లోకేష్ చెప్పడంతో.. జంప్ అయ్యారు. ఈ విషయాలన్నీ.. మావోయిస్టుల ఎదురుగా.. స్వయంగా కిడారి చెప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు అప్పట్లో చెప్పడం కలకలం రేపాయి. మావోయిస్టుల చేతిలో కిడారి సర్వేశ్వరరావు హత్యకు గురైన తర్వాత.. ఆయన కుమారుడు కిడారి శ్రావణ్ కుమార్‌ని ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా కనీసం అవకాశం ఇవ్వకుండానే ఆగమేఘాలపై చంద్రబాబు తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సరిగ్గా ఆరు నెలల తర్వాత లోకేష్ కోసం మంత్రి పదవుల సర్దుబాటులో భాగంగా కిడారి శ్రావణ్‌తో మంత్రి పదవికి చంద్రబాబు రాజీనామా చేయించేశారు. ఆ తర్వాత 2019లో టీడీపీ తరఫున పోటీ చేసినా.. పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జిగా ఐదేళ్లుగా టీడీపీని అరకులో నిలబెట్టారు. అలాంటి కిడారిని కూడా కరివేపాకులా తీసిపారేయడంతో ఈ యువనాయకుడికి దిక్కుతోచని పరిస్థితి. అధినేతతో మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణపై అనుచరులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

నైరాశ్యంలో 'వంతల'

గిడ్డి, కిడారి బాటలో చంద్రబాబుని నమ్మి మోసపోయిన జాబితాలో వంతల రాజేశ్వరి కూడా చేరారు. రంపచోడవరం నియోజకవర్గం నుంచి 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయం సాధించారు. టీడీపీ ఆకర్ష్‌లో భాగంగా.. తాను పార్టీ మారితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారంటూ 2016 మార్చిలో సంచలన వ్యాఖ్యలను బహిరంగంగా చేసిన వంతల.. ఏడాది కాలంలోనే వైఎస్సార్‌సీపీని వీడి.. డబ్బు ఆశ చూపిన పచ్చ కండువానే కప్పుకున్నారు. చట్టసభలకు పంపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే చివరి వరకూ నా రాజకీయ ప్రయాణమని చెప్పి.. ప్రలోభాల ఎరలో చిక్కుకొని టీడీపీలోకి జంప్ అయ్యారు. 2019లో టీడీపీ తరఫున పోటీ చేసినా.. ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన వంతలను ఇంటిలోనే కూర్చోబెట్టారు. ఆ తర్వాత నియోజకవర్గంలో టీడీపీని బతికించేందుకు వ్యయప్రయాసలతో ఐదేళ్లు పనిచేసినా.. చంద్రబాబు గుర్తించకుండా.. వంతల సేవలకు స్వస్తి చెప్పారు. టికెట్ రాకపోవడంతో రాజేశ్వరి నైరాశ్యంలో కూరుకుపోయారు. పార్టీ కోసం సేవచేసినా.. మిరియాల శిరీషకు టికెట్ రావడంతో చంద్రబాబు తనకు కూడా వెన్నుపోటు పొడిచేశారంటూ సన్నిహితుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

ఇప్పుడైనా సరైన నిర్ణయం తీసుకోకుంటే..

ముగ్గురు ఫిరాయింపుదారులకూ టీడీపీ చెక్ పెట్టింది. వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన వారందరికీ.. చంద్రబాబు మళ్లీ వెన్నుపోటు పొడిచారంటూ ప్రజలే మాట్లాడుకోవడం విశేషం. రాజకీయాల్లో ఉన్నవారు.. పదవులు కోల్పోయినా.. ఇప్పుడు కాకపోతే మరోసారైనా విజయం దక్కించుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే.. సానుభూతిని.. ప్రజలలో విశ్వాసాన్ని మాత్రం కోల్పోకుండా చూసుకోవాలి. ఈ విషయంలో మాత్రం వైఎస్సార్‌సీపీని కాదని టీడీపీకి వెళ్లిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు చంద్రబాబుని నమ్మి పూర్తిగా నష్టపోవడంతో పాటు ప్రజల్లో విశ్వాసాన్ని కూడా కోల్పోయారు. ఈ ఎన్నికల్లో సరైన నిర్ణయాన్ని తీసుకోకపోతే వీరి రాజకీయ భవిష్యత్తుకు చరమగీతం పాడినట్లే అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పాలుపోని ఈశ్వరి..

2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి.. ఎమ్మెల్యేగా విజయం సాధించిన గిడ్డి ఈశ్వరి.. తర్వాత చంద్రబాబు మాయమాటలతో పార్టీ ఫిరాయించేశారు. రూ.5 కోట్ల డీల్ తోపాటు మంత్రి పదవి ఇస్తానని చెప్పి.. చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించడంతో.. అన్నలా ఆదరించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కాదని.. నయవంచకుడి పంచన చేరి.. 2018లో పచ్చ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి గిడ్డికి అన్నీ కష్టాలే ఎదురయ్యాయి. టీడీపీలో సరైన ప్రాధాన్యమివ్వడం తగ్గించేశారు. 2019 టీడీపీ నుంచి కష్టపడి టికెట్ సాధించి పోటీలో నిలిచారు. వైఎస్సార్‌సీపీకి అన్యాయం చేసిన గిడ్డి ఈశ్వరిపై విశ్వాసం కోల్పోయిన ప్రజలు.. ఆమెని ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు చంద్రబాబు కూడా ఈశ్వరిని పొమ్మనకుండా పొగపెట్టే ప్రయత్నాలు చేస్తూ.. పొత్తుల్లో భాగంగా టికెట్‌ని బీజేపీకి కట్టబెట్టేశారు. దీంతో.. గిడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తన గోడు వినిపించేందుకు వెళ్దామని అనుకున్నా.. చంద్రబాబు రానివ్వడం లేదని తెలుస్తోంది. దీంతో.. గిడ్డి అనుచరులు మండిపడుతున్నారు. రెబల్‌గా పోటీ చేయాలని పార్టీ శ్రేణులు చెబుతున్నా.. ఏం చెయ్యాలో పాలుపోక నడిసంద్రంలో నిలిచిపోయినట్లు తన పరిస్థితి ఉందని సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

మత్స్యశాఖ జేడీగా విజయకృష్ణ బాధ్యతల స్వీకరణ


విజయకృష్ణ

మహారాణిపేట: మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఎం.విజయకృష్ణ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. లైంగిక వేధింపుల కేసు ఎదుర్కొంటున్న మత్స్యశాఖ జేడీ ఎస్.కె.లాల్ మహమ్మద్‌ను ఆ బాధ్యతల నుంచి మత్స్యశాఖ తప్పించింది. అతని స్థానంలో పూర్తి అదనపు బాధ్యతల(ఎఫ్ఏసీ)తో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణను నియమించిన సంగతి తెలిసిందే. దీంతో విజయకృష్ణ బాధ్యతలు స్వీకరించగా.. ఆయన్ని పలువురు అభినందించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో పల్లవి, శ్రీలక్ష్మి సత్తా

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా అంతర్ వర్సిటీల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఏయూ విద్యార్థినులు ఎస్.పల్లవి, శ్రీలక్ష్మి సత్తాచాటారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో గత నెల జరిగిన పోటీల్లో 64 కిలోల వెయిట్‌లో పల్లవి స్వర్ణం, 81 కిలోల వెయిట్‌లో శ్రీలక్ష్మి రజత పతకం సాధించారు. గత నెల అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో శ్రీలక్ష్మి స్వర్ణాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ వీరిద్దర్ని శుక్రవారం అభినందించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగానికి చెందిన విజయ్‌మోహన్, పల్లవి పాల్గొన్నారు.

7న కృత్రిమ అవయవాల కొలతల శిబిరం

డాబాగార్డెన్స్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న పోర్టు కళావాణి ఆడిటోరియంలో కృత్రిమ అవయవాల కొలతల శిబిరం నిర్వహిస్తున్నారు. సంస్థాన్ ట్రస్టీ డైరెక్టర్ దేవేంద్ర చౌబీసా నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. దివ్యాంగులు తమ ఆధార్ కార్డు, రెండు ఫుల్‌సైజ్ ఫొటోలు, వికలాంగులుగా ధ్రువీకరించిన సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 72300 12630ను సంప్రదించాలి. సంస్థాన్ ప్రజా సంబంధాల అధికారి భగవాన్ ప్రసాద్ గౌర, సామాజిక వేత్త సన్‌మూర్తి జి.జగదీష్, ఎంవీ రాజశేఖర్, బంగ్రరాజు పాల్గొన్నారు.

జిల్లా పర్యాటక శాఖ అధికారిగా జ్ఞానవేణి

సాక్షి, విశాఖపట్నం : జిల్లా పర్యాటక శాఖ అధికారిగా కుంచె జ్ఞానవేణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. డీటీవోగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ మాయూర్ అశోక్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో డీటీవోగా పని చేసిన అనుభవం ఉందని జ్ఞానవేణి అన్నారు.

ఎన్‌ఏడీ జంక్షన్‌లో సుజుకి శాటిలైట్ అవుట్‌లెట్


షోరూంను ప్రారంభిస్తున్న ఏరియా మేనేజర్ వంశీకృష్ణ, వరుణ్ గ్రూప్ ఎండీ వరుణ్ దేవ్

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్‌లో సుజుకి ద్విచక్రవాహన డీలర్ పద్మజ సుజుకి నూతన శాటిలైట్ అవుట్‌లెట్ ప్రారంభమైంది. సుజుకి సేల్స్ ఏరియా మేనేజర్ పి.వంశీకృష్ణారెడ్డి, వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ ఈ అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్‌దేవ్ మాట్లాడుతూ సుజుకి వినియోగదారులకు ఎన్‌ఏడీ జంక్షన్ అత్యాధునికమైన శాటిలైట్ అవుట్‌లెట్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇక్కడ వినియోగదారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. అతితక్కువ డౌన్ పేమెంట్, తక్కువ వడ్డీ రేట్లతో వాహనాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.వినోద్‌కుమార్, జీఎం రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నాయకులపై కేసు కొట్టివేత


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

డాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో(2016) ఆరుగురు సీపీఎం నాయకులపై నమోదైన కేసును విశాఖపట్నంలోని 2వ మెట్రోపాలిటన్ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. దాదాపు ఎనిమిదేళ్ల సాగిన వాదనల్లో సీపీఎం నాయకులు కె.లోకనాథం, వీవీ శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ముక్కు సుబ్బారావు, వై.రాజు, ఆర్ఎస్ మాధవికి.. ఈ కేసుకు ఎటువంటి సంబంధం లేదని నిర్ధారించింది. ఈ మేరకు నిర్దోషులుగా కోర్టు తమని ప్రకటించిందని వారు తెలిపారు. ఈ కేసును సీనియర్ న్యాయవాది బీవీ రామాంజనేయరావు, జూనియర్ లాయర్లు చిత్తరంజన్, వెంకట్, సుహాసిని వాదించారన్నారు.

బీజేపీ వాగ్దానాలు.. వైఫల్యాలపై 17న సదస్సు

డాబాగార్డెన్స్: బీజేపీ వాగ్దానాలు-వైఫల్యాలపై ఈ నెల 17న అంబేడ్కర్ భవన్ వేదికగా ఉత్తరాంధ్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు భారత్ బచావో వైస్ చైర్మన్లు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, మార్పు శరత్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014 నుంచి కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా.. ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ భావజాలం, ఆదేశాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. భారత సమాజం తీవ్ర ప్రమాదంలో ఉందని, దేశానికి కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ది క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా పుస్తక రచయిత, రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్, భారత బచావో జాతీయ ఉపాధ్యక్షుడు ఎంఎఫ్ గోపీనాథ్, సీపీఐ నాయకుడు జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఎం నాయకుడు ఎం.జగ్గునాయుడు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి సీతల్ మదన్, క్రిష్టియన్ మైనార్టీ నాయకుడు జి.స్వామినాథన్, ముస్లిం మైనార్టీ నాయకుడు ఎం.ఇబ్రహీం సదస్సులో పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో భారత్ బచావో విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్ఆర్ వేమన, డాక్టర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాక్షి అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ కోటేశ్వరరావుకు రాష్ట్ర స్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న సాక్షి అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ బొల్లం కోటేశ్వరరావు

విశాఖ సిటీ: వాతావరణ మార్పులపై రాసిన పలు విశ్లేషణాత్మక కథనాలకు 'సాక్షి' అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ బొల్లం కోటేశ్వరరావుకు రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. అమెరికా కాన్సులేట్ జనరల్ వాతావరణ మార్పులపై చోటుచేసుకునే పరిణామాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని జర్నలిస్టులకు ఒడిశాకు చెందిన వ్యాస్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఏడాది నుంచి వీటిని వివిధ రాష్ట్రాల్లో చేపడుతోంది. ఈ మూడు రాష్ట్రాల్లో వాతావరణ మార్పులపై కథనాలు రాసిన జర్నలిస్టులను ఎంపిక చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విభాగాల్లో ఒక్కొక్కరిని గుర్తించారు. ఇందులో ప్రింట్ మీడియా విభాగం నుంచి విశాఖపట్నం యూనిట్‌లో 'సాక్షి' అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ బొల్లం కోటేశ్వరరావును క్లైమేట్ చేంజ్ రిపోర్టింగ్‌లో రాష్ట్ర స్థాయి ఉత్తమ జర్నలిస్టు ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అమెరికన్ కాన్సులేట్ పబ్లిక్ అఫైర్స్ అధికారి అలెగ్జాండర్ మెక్ లారెన్స్ చేతుల మీదుగా కోటేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు.

ఏయూ అంబేడ్కర్ చైర్‌కు జాతీయ స్థాయిలో ప్రశంసలు


సౌరభ్ గార్గ్‌కు నివేదిక అందిస్తున్న ఆచార్య జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ చైర్ 7 అంతర్జాతీయ, 13 జాతీయ పేటెంట్లు సాధించడం పట్ల భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ అభినందించింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఫౌండేషన్ సమీక్ష సమావేశంలో ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొని.. ఫౌండేషన్ కార్యదర్శి సౌరభ్ గార్గ్‌కు నివేదికను సమర్పించారు. 2023-24 సంవత్సరానికి మొత్తం 30 పేటెంట్‌లను సాధించామన్నారు. శ్రీకాకుళం ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిని గుర్తించడానికి బయోమెడికల్ చిత్రాలను విశ్లేషించే సాంకేతికతను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఏయూ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం చేస్తున్న కృషి, ఉద్దానం ప్రాంతంలో ప్రజలకు ఉపయుక్తంగా చేపట్టిన పరిశోధనలు ఎంతో ప్రత్యేకమని సౌరభ్ గార్గ్ ప్రశంసించారు. డిజిటల్ సాంకేతికతను ఉపయుక్తంగా మార్చుకుంటూ గ్రామీణ ప్రాంతాలు, సామాజిక అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ఆచార్య జేమ్స్ స్టీఫెన్ వివరించారు. పెందుర్తి మండలంలోని ఐదు గ్రామాలను దత్తత తీసుకుని.. ఆ గ్రామాల్లో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధులకు తెలిపారు. అదనపు కార్యదర్శి అమిత్ కుమార్, జాయింట్ సెక్రటరీ బిశ్వరంజన్ సన్మాల్, రాధిక చక్రవర్తి, దేశ వ్యాప్తంగా ఉన్న 24 అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ట్రయల్ కోర్టు అనుభవం ఎంతో అవసరం

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

సబ్బవరం: ట్రయల్ కోర్టులో వాదించడం న్యాయవాదులకు ఓ కళ అని, అటువంటి వారే వృత్తిలో విశేషంగా రాణిస్తారని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ది ట్రయల్ అడ్వకేసీ వర్క్‌షాపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వర్సిటీకి చెందిన ప్రో బోనో క్లబ్, లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ట్రయల్ కోర్టు అనుభవం న్యాయవాదికి ఎంతో అవసరమన్నారు. ట్రయల్ కోర్టు ప్రాక్టీస్ తర్వాత మాత్రమే పై కోర్టులకు వెళ్లాలని న్యాయ విద్యార్థులకు సూచించారు. కేసులకు సంబంధించిన ఆధారాల సేకరణలో ఎంతో జాగ్రత్త వహించాలన్నారు. అప్పుడే కక్షిదారులకు న్యాయం చేయగలుగుతారని తెలిపారు. ముందుగా ఈ వర్క్‌షాపును వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్లు అవదేశ్ నారాయణ సంఘ్వి, ప్రసన్న స్వామినాథన్, శరత్‌చంద్ర, ప్రశాంత్ కుమార్, దేశంలో వివిధ ప్రాంతాల్లో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు, న్యాయ వర్సిటీ, కళాశాలల విద్యార్థులు వర్క్‌షాపునకు హాజరయ్యారు. డీఎస్ఎన్ఎల్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కన్వీనర్ డాక్టర్ నందిని, పీబీసీ చైర్‌పర్సన్ బి.వి.ఎస్ సునీత, డాక్టర్ సిహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రత్యేక స్పందనకు ఏడు ఫిర్యాదులు

విశాఖ సిటీ: తన భర్త, అతని కుటుంబ సభ్యులు గృహహింసకు పాల్పడుతున్నారని ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి ఓ దివ్యాంగురాలు.. తన భూమి ఆక్రమణకు గురైందని అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన అంధుడు అర్జునరావు.. ఇలా దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రత్యేక స్పందనకు విశాఖ నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా ఫిర్యాదు వచ్చాయి. సీపీ చాంబర్‌లో దిశ దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌లో భాగంగా సైన్ లాంగ్వేజ్ నిపుణురాలు దివ్యాంగుల నుంచి ఏడు ఫిర్యాదులు స్వీకరించారు. ఏపీడబ్ల్యూఎఫ్‌డీ అధ్యక్షురాలు అరుణ అనే దివ్యాంగురాలు, అంధుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంధుడు హెలెన్ కిల్లర్ సీపీకి ఫోన్ చేసి.. దిశ దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఫిర్యాదులను సంబంధిత ప్రాంతాల అధికారులకు రాతపూర్వకంగా పోస్టల్‌లో, వాట్సాప్ ద్వారా తెలియజేసి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఇన్‌స్పెక్టర్‌ను సీపీ ఆదేశించారు. అంధులు, దివ్యాంగులకు మరింత వెసులుబాటు కల్పిస్తూ.. ఇకపై ప్రతి నెలా 2, 15వ తేదీల్లో సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య దిశ దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు సీపీ తెలిపారు. అంధుల సమస్యలు 73373 24466కు, దివ్యాంగుల సమస్యలను 73374 34422కు తెలియజేయవచ్చని సూచించారు.

ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ

మహారాణిపేట: కొత్తగా నమోదు, సవరణ చేసిన ఓటర్లకు ఎన్నికల కమిషన్ అనుమతితో ముద్రించిన కార్డులను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 20 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ వరకు జిల్లాలో 4,29,824 మందికి ఓటర్లకు గుర్తింపు కార్డు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. 2,08,958 మంది గుర్తింపు కార్డులను ఇంటి చిరునామా ప్రకారం అందజేశామని, మిగిలిన 2,20,866 కార్డులను సిద్ధం చేసి పోస్టల్ ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.